## అలైన్‌మెంట్‌ను కాపాడాలి

బంజారాహిల్స్,మే 27: ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ స్థలాల్లో వేరే నియోజకవర్గానికి సంబంధించిన కార్యాలయాలు పెట్టడం మానుకోవాలని, స్థానిక ప్రజల కోసం అభివృద్ధి పనులకు స్థలాలను వినియోగించాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పేర్కొన్నారు. షేక్‌పేట మండల పరిధిలోని పద్మాలయ అంబేద్కర్‌నగర్ బస్తీని ఆనుకుని ఉన్న 1.30 ఎకరాల స్థలాన్ని కార్వాన్ నియోజకవర్గంలో కొనసాగుతున్న వెస్ట్‌జోన్ ఆర్టీఏ కార్యాలయానికి కేటాయించడంపై కార్పొరేటర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. హైదరాబాద్ జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిలింనగర్ సమీప ప్రాంతాల్లో వేలాదిమంది విద్యార్థుల కోసం జూనియర్ కాలేజీ నిర్మించాలని ఎంతో కాలంగా తాము కోరుతుంటే స్థలం లేదని చెపుతున్న ప్రభుత్వం పద్మాలయ అంబేద్కర్ బస్తీ స్థలాన్ని వేరే కార్యాలయానికి ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై తగు చర్యలు తీసుకోకుంటే నియోజకవర్గం ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## ట్రంప్ వ్యాపారులను భారత్‌లో బహిష్కరించాలి

హిమాయత్ నగర్,మే 27: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాపారులను భారత్‌లో బహిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు దేశానికి వ్యతిరేకంగా, తలవంపులు తెచ్చేవిగా ఉన్నాయని ఆరోపించారు.భారతదేశంనుంచి చదువు కునేందుకు,ఉద్యోగాల నిమిత్తం అమెరికాకు వెళ్లిన భారతీయులను ఇబ్బందులకు గురిచేస్తూ బలవంతంగా తిరిగి దేశానికి పంపించడం అన్యాయమన్నారు. అమెరికా నుంచి దేశానికి డబ్బు పంపేవారు 5 శాతం పన్ను విధించాలని నిబంధనలు పెట్టడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ట్రంప్ వ్యాపారులకు ఎలాంటి అనుమతులు ఇవ్వకుండా దేశంలో ఇప్పటి వరకు ట్రంప్‌కు సంబంధించిన ఎన్ని వ్యాపార సంస్థలు ఉన్నాయో దేశ ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు.

## ఫీజు నియంత్రణపై చర్యలు తీసుకోవాలి

అడ్డగుట్ట: రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణకై చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మికి బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించడం జరిగింది. ప్రవేట్ పాఠశాలలను సందర్శించి ఫీజుల దోపిడీని అరికట్టి పేద, మధ్యతరగతి పిల్లలకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు.

# బోధన పద్ధతుల్లో..మార్పులు రావాలి

**డీఈఓ రోహిణి**



జీవశాస్త్రం ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో బోధన పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న డీఈఓ రోహిణి

జూబ్లీహిల్స్, మే 27: పాఠ్యంశాలను ప్రయోగాత్మకం.. సృజనాత్మకంగా బోధించే పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖధికారి ఆర్.రోహిణి పేర్కొన్నారు. మంగళవారం యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 26 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న రెండో విడత జీవశాస్త్రం ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. అనంతరం ఉపాధ్యాయులకు బోధనా పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. పోటీ ప్రపంచంలో ఆధునిక బోధన పద్ధతులను అలవర్చుకోవాలని అన్నారు. జిల్లాలో శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా బోధించాలని సూచించారు.
జీవశాస్త్రంలో మొదటి విడత 90 మంది టీచర్లకు శిక్షణ పూర్తి కాగా. రెండో విడత 88 మంది టీచర్లకు శిక్షణ ఇస్తున్నట్లు కోర్స్ డైరెక్టర్, ముషీరాబాద్ డిప్యూటీ డీఈఓ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్స్ లక్ష్మీనారాయణ, మాలతి, గోవర్ధన మణి, సుజిత తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల్లో వెలుగులు నింపాలి



హిమాయత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న టి.వెంకట్రాములు

హిమాయత్ నగర్,మే 27: చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టి.వెంకట్రాములు,రాష్ట్ర అధ్యక్షుడు పెండెం సర్వేశం డిమాండ్ చేశారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లో సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత కార్మికులు దీర్ఘకాలికంగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని,ఎన్నికల ముందు చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికీ లక్షలాది మంది కార్మికులు చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు.ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు,టెస్కోకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనర్సయ్య,నేతలు రాములు,కోట రాజయ్య,రామకృష్ణ,సత్తయ్య,కృష్ణ మూర్తి,వెంకటేశ్వర్లు,సంపత్,కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంపై చొరవ చూపాలి

**అధికారులకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆదేశాలు**



లక్ష్మీగూడలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి, మే 27: ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తెలుసుకొని పరిష్కారమార్గాలు చూపేలా అధికారులు చొరవ చూపాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడ, రాజీవ్‌గృహకల్ప,ఓల్డ్ కర్నూల్ రోడ్, మైలార్‌దేవ్‌పల్లి తదితర ప్రాంతాల్లో ఆయన జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ, మంచి నీరు, రోడ్లు, వీధిదీపాలు, పారిశుద్ధ్యంపై ప్రజలు ఆయనకు ఫిర్యాదు చేశారు. సంబంధిత శాఖల అధికారులను సమస్యలపై నిలదీసి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్, జలమండలి జీఎం లక్ష్మి, రేణుక, డివిజన్ అధ్యక్షులు ఎన్.ధనుంజయ్, టి.ప్రేమ్ గౌడ్, అడికే అర్జున్, సరికొండ వెంకటేష్, జీవన్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, లావణ్య, రాధారెడ్డి, శరణమ్మ, పుష్ప, అనిత, మానస, ఓం ప్రకాష్, లక్ష్మారెడ్డి, బండారు యాదగిరి పాల్గొన్నారు.

## డ్రగ్స్‌రహిత సమాజం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలి

**ఉపాధ్యాయుల శిక్షణలో జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు**



ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

శంషాబాద్ రూరల్, మే 27 : డ్రగ్స్ రహిత సమాజం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు సూచించారు. మంగళవారం శంషాబాద్ పట్టణంలోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌రహిత సమాజం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. దీంతో పాటు విద్యార్థులకు డ్రగ్స్ తీసుకోవడంతో వచ్చే నష్టాలను వివరించాలన్నారు. విద్యార్థి దశ నుంచే డ్రగ్స్‌కు దూరంగా ఉండే విధంగా పాఠశాలలోనే అవగాహన కల్పించాలని వివరించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అప్పుడే ఉపాధ్యాయులకు మంచిపేరు వస్తుందని వివరించారు. సమావేశంలో ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, కోర్స్ డైరక్టర్ నరేందర్,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నకిలీ వైద్యుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణిమ

ఖైరతాబాద్, మే 27 : నకిలీ వైద్యుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సామాజిక కార్యకర్త, ప్రముఖ అంతర్జాతీయ క్రీడాకారిణి, ఉమెన్స్ వెల్‌నెస్ కోచ్ పూర్ణిమ మండవ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆరోగ్య రంగాన్ని వ్యాపారంగా మార్చుకొని కొందరు డాక్టర్ అనే పదాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. చర్మం, జుట్టు, వెల్నెస్ పేరుతో క్లినిక్‌లు ఏర్పాటు చేసుకొని అనర్హులతో చికిత్సలు చేయించి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ఇలాంటి వైద్యులు, క్లినిక్‌లపై పోరాటం చేస్తున్నామని, నష్టపోయిన బాధితులకు అండగా నిలుస్తున్నామన్నారు. కొన్ని క్లినిక్‌లలో జరుగుతున్న ఇలాంటి అక్రమాలను బయటపెడితే బాడీ షేమింగ్ చేస్తూ, ట్రోల్ చేస్తున్నారన్నారు.
ప్రజారోగ్యాలతో చెలగాటమాడుతున్న క్లినిక్‌లు, వైద్యులపై విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## 29న పిల్లల సురక్షితపై సదస్సు

హిమాయత్ నగర్,మే 27: రాష్ట్రంలో జూన్ 12న స్కూల్స్ పున: ప్రారంభమవుతున్న నేపథ్యంలో పాఠశాలల నుంచి పిల్లల సురక్షిత, రవాణ కోసం తీసుకోవాల్సిన చర్యలు,జాగ్రత్తలపై ఈనెల 29న ఖైరతాబాద్‌లోని మోక్ష గుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. అనిల్ కుమార్, కోశాధికారి కె.శ్రీకాంత్ రెడ్డి లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో స్కూల్ బస్సులు ఉన్న యాజమాన్యాలతో పిల్లల సురక్షిత రవాణ వంటి అంశాలపై చర్చించి తగు సూచనలు చేయడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్‌లు హాజరు కానున్నట్లు వారు తెలిపారు.

## లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్, మే 27 : లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని పాలమాకుల గ్రామంలోని లక్ష్మీనర్సింహ వైన్స్ ఎదురుగా లారీ ఢీకొని ఓ వ్యక్తి పడిఉన్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

## 'మహిళల సమస్యలు పరిష్కరించాలి'

హిమాయత్ నగర్: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.ప్రేంపావని ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. మంగళవారం హిమాయత్ నగర్ లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో తమ శక్తి సామర్థ్యాలు నిరూపించు కుంటున్నప్పటికీ అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మహిళలపై వేధింపులు, దాడులు జరుగుతున్నప్పటికీ వాటిని నిలువరించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని విమర్శించారు.మహిళల సంక్షేమం కోసం నిధులు కేటాయించి వారి అభ్యున్నతి కోసం ఖర్చు చేసేలా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## శివరాంపల్లి రైల్వే గేటు వద్ద ప్రహరీని తొలగించాలి



రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజినీర్ పి.టి.వి.దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, మే 27: శివరాంపల్లి రైల్వే గేట్(ఎల్‌సీ–8) ప్రాంతంలో రోడ్డును మూసి వేస్తూ అడ్డుగా నిర్మించిన ప్రహరీ గోడ కారణంగా స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రజలు, నాయకులతో కలిసి రైల్వే గేట్ ప్రాంతంలో బ్రిడ్జి లేదా అండర్ బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ రైల్వే అడిషనల్ మేనేజర్ ఎం.ఎ.రెహమాన్, సీనియర్ డివిజనల్ ఇంజినీర్, కోఆర్డినేటర్ పి.టి.దుర్గాప్రసాద్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే గేట్ నుంచి అనేక మంది ప్రయాణం కొనసాగిస్తారన్నారు. 2022లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ దారిని మూసి వేసి గోడను నిర్మించారన్నారు. అప్పటి నుంచి స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతూ సుమారుగా 5 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. వెంటనే ఈ ప్రాంతంలో బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నోముల రాముయాదవ్, అక్కెం రఘుయాదవ్, బండ రాజేష్‌యాదవ్, ఎడ్లకాడి, సూర్యం, ఎస్.అశోక్, కవ్వగూడెం, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



## 35 ఏండ్ల తరువాత..మధుర జ్ఞాపకాలు

*మూడు దశాబ్దాల తర్వాత ఆ స్నేహం కలిసింది. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. 1989–90 సంవత్సరంలో నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసుకుని నేటికి 35 సంవత్సరాలు గడిచిన సందర్భంగా మంగళవారం నార్సింగి లోని ఓ ఫామ్ హౌస్‌లో ఆ పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం మూడున్నర దశాబ్దాల తర్వాత కలిసిన తమ స్నేహితులతో ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఇన్నాళ్లు జీవితంలో జరిగిన సంఘటనలను సుదీర్ఘంగా చర్చించుకున్నారు. ఈ పూర్వ విద్యార్థులలో రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి, నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ జి వెంకటేశ్ యాదవ్, కోకాపేట మాజీ ఎంపీటీసీ సభ్యురాలు అలివేలు మంగ, మాజీ వార్డు సభ్యుడు వినోద్ కుమార్ పుప్పాలగూడ, ఖానాపూర్, గండిపేట, జన్వాడ తదితర గ్రామాలకు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. – మణికొండ, మే 27 :*

## సాయం చేస్తున్నట్లు నటించి..ఏటీఎంలో డబ్బు డ్రా ..

వెంగళరావునగర్, మే 27 : ఏటీఎం లో డబ్బు డ్రా చేసుకునేందుకు వెళ్లిన టీచర్‌కు సాయం చేస్తున్నట్లు నటించి.. ఆమె అకౌంట్ నుంచి రూ.40 వేలు కాజేశాడో దొంగ. అనుమానం రాకుండా ఆమెకు మరో ఏటీఎం కార్డు చేతుల్లో పెట్టి నగదును అపహరించుకెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది బాధితురాలు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం ఎర్రగడ్డ నేతాజీ నగర్ కు చెందిన ఉపాధ్యాయురాలు ఫర్హాభాను ఎస్.ఆర్.నగర్ మెట్రో స్టేషన్ సమీపంలోని ఎస్.బి.ఐ. ఏటీఎం సెంటర్‌లో నగదు వస్తలేదని ఆ సెంటర్‌లో ఉన్న వ్యక్తికి చెప్పింది. అతను మళ్ళీ ప్రయత్నించాలంటూ ఆమె ఎంటర్ చేసిన పిన్ నెంబర్‌ను చూసి ఆమె ఏటీఎం కార్డును తీసుకుని దృష్టి మళ్లించి వెళ్లిపోయాడు. అనంతరం బాధితురాలి అకౌంట్ లోని రూ.40 వేలు డ్రా అయినట్లు ఆమె ఫోన్‌కు మెసేజ్ రావడంతో తాను మోసపోయానని గ్రహించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బాలిక అదృశ్యం



రజిని (ఫైల్)

శంషాబాద్ రూరల్, మే 27 : బాలిక అదృశ్యమైన ఘటన మంగళవారం శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చదర్‌గూడ గ్రామానికి చెందిన బక్క రజిని(26)ఇంటి వద్దనే ఉంటూ జీవనం సాగిస్తుంది. ఈ నెల 25న ఉదయం 8 గంటల సమయంలో బాలిక తండ్రి శంకరయ్య పని నిమిత్తం బయటికి వెళ్లి సాయంత్రం ఇంటికొచ్చి చూడగా కూతురు కనిపించ లేదు. దీంతో ఆయన గ్రామంలో ఎక్కడ చూసినా ఆమె జాడ కనిపించలేదు. బాలికకు నరాల బలహీనత ఉందని వివరించా రు. దీంతో ఆమె ఎక్కడికి వెళ్లిందో తెలియడంలేదన్నారు. దీంతో ఆమె ఆచూకీ కోసం శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## ఖైరతాబాద్‌లో మరో బాలిక



కోనేటి రమ్య (ఫైల్)

ఖైరతాబాద్ : ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ బాలిక కనిపించకుండా పోయింది. ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌లో ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకు చెందిన కె. వెంకటేశ్ కుటుంబం బతుకుదెరువు కోసం ఏడాది క్రితం రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మామిడిపల్లిలో రంగనమాకుల కాలనీలో నివాసం ఉంటున్నారు. కొడుకు గణేశ్ (17), కూతురు రమ్య (16)లను స్వస్థలంలోనే ఉంచి అక్కడే చదివిస్తున్నారు. ఎండాకాలం సెలవులు కావడంతో పిల్లలిద్దరూ ఇంటికొచ్చారు. ఇటీవల ప్రేమ్‌నగర్‌లో నివాసం ఉండే బావమరిది ఇంటికి వెంకటేశ్ కుటుంబంతో సహా వచ్చాడు. ఈ నెల 26న రమ్య కిరాణా షాపునకు వెళ్లి వస్తానంటూ చెప్పి బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు కూడా తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీశారు. అయినా ఫలితం లేకపోవడంతో ఓ యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

**'గుడ్ మార్నింగ్ మణికొండ' కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు**



అల్కాపూర్ టౌన్‌షిప్‌లో స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ తదితరులు

మణికొండ, మే 27: కొండని తవ్వి ఎలుకను పట్టిన చందంగా మణికొండ మున్సిపాలిటీ అధికారుల తీరు ఉందని మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు. 'గుడ్ మార్నింగ్ మణికొండ' పేరిట మంగళవారం మణికొండ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 19లో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేరుకు కొద్దిపాటి అనుమతులు తీసుకొని అంతస్తులపై అంతస్తులు వేస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. తమకు గిట్టని వారికి చెందిన ఒక ఇంటి పైకప్పు కొద్దిపాటి కూల్చివేత చేసి చట్టరీత్యా బాధ్యతతో వ్యవహరిస్తున్నామని నమ్మబలకడం వీరికి పరిపాటేనన్నారు. నిజానికి అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరిస్తే కొన్ని వందల సంఖ్యలో ఇండ్లను కూల్చివేయాల్సి వస్తుందన్నారు.వీధులలో, ఖాళీ ప్లాట్లల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి దోమలు విజృంభిస్తున్నాయన్నారు. ఎప్పటికప్పుడు పరిశుభ్రత పనులు చేపట్టాలన్నారు. గోతులమయంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేసి వాటిని పూడ్చాలన్నారు. వర్షపు నీరు, మురికి నీరు సాఫీగా వెళ్లడానికి డ్రైనేజీ వ్యవస్థను వెంటనే శుభ్రపరచాలన్నారు. రహదారి కూడలిల్లో వర్షపు నీరు హార్వెస్టింగ్ పిట్‌లను కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కుంభగళ్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, సంఘం శ్రీకాంత్, భానుచందర్, సుమనళిని, బొడ్డు శ్రీధర్, రాజేంద్రప్రసాద్, చెరుకూరి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## సాగులో మార్పు అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షులు ప్రమోద్ కుమార్

వ్యవసాయ యూనివర్సిటీ, మే 27: దేశ సాగులో మరింత మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని జాతీయ పరిశోధన కేంద్రం అధ్యక్షుడు ప్రమోద్ చౌదరి అన్నారు.వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో జాతీయ విద్యావిధానం అమలుపై 'మేధోమథన సెషన్,జాతీయ విద్యా విధానం అమలు,వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో స్థితి, సవాళ్లు , ముందుకు సాగే మార్గం' అనే అంశంపై హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ రెండు రోజుల మేథోమథన సెషన్‌ను నిర్వహిస్తోంది. భారతీయ వ్యవసాయ–ఆర్థిక పరిశోధన కేంద్ర జాతీయ అధ్యక్షుడు అడ్వకేట్ ప్రమోద్ చౌదరి మాట్లాడుతూ.. భారత దేశం తన జనాభాకే కాకుండా ప్రపంచానికి ఆహారం ఇవ్వడానికి సంసిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయ విద్యా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (విద్యా ప్రణాళిక , గృహ శాస్త్రం) డాక్టర్ బిమ్లేష్ మాన్ పరిశోధనలకు విదేశీ నిధుల అవసరం, సంస్థలకు ఆదాయ ఉత్పత్తి నమూనాల అభివృద్ధి, కొత్త పరిశోధన ప్రాంతాలను గుర్తించడం , సహజ వ్యవసాయ పద్ధతులపై పెరిగిన ప్రాధాన్యంపై వివరించారు.కార్యక్రమంలో 45 రాష్ట్రాల వ్యవసాయ విశ్వవిద్యాలయాల డీన్‌లు, డైరెక్టర్లు ,రిజిస్ట్రార్‌లతో సహా దాదాపు 75 మంది ప్రముఖులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి

**హైకోర్టు న్యాయవాది భానుమూర్తి**



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది భానుమూర్తి

ఖైరతాబాద్, మే 27 : న్యాయవాదుల రక్షణ ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేయాలని హైకోర్టు న్యాయవాది భానుమూర్తి బాల డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు సామాన్యులకు న్యాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తారని, కాని తమకు ఎలాంటి రక్షణ చట్టాలు లేకపోవడం వల్ల దాడులు, దౌర్జన్యాలు, హత్యాయత్నాలు జరుగుతున్నాయన్నారు. న్యాయస్థానాలు, న్యాయవాద సంఘాలు బాధిత న్యాయవాదులకు అండగా నిలబడాలన్నారు. న్యాయస్థానాల్లో అనేక కేసులు పెద్ద ఎత్తున పెండింగ్‌లో ఉన్నాయని, ఫలితంగా ఒక్కో సారి క్లయింట్లే న్యాయవాదులపై దాడులకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయన్నారు. సత్వర న్యాయంపై దృష్టిపెట్టాలని, కోర్టుల్లో కేసు కేసుల లిస్టింగ్ త్వరితగతిన జరిగేలా చూడాలని, ప్రభుత్వం తరపున కౌంటర్లు వేగంగా దాఖలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. . సీనియర్ సిటిజన్లకు ఉచిత న్యాయ సహాయం, ఆర్థిక సాయం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కోర్టుల్లో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తక్షణమే న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది సంఖ్య పెంచాలని, పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.

## మహిళ ఆత్మహత్య

బంజారాహిల్స్, మే 27: మద్యానికి బానిసగా మారిన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ రోడ్ నం.5లోని దుర్గాభవానీనగర్ బస్తీకి చెందిన ముదావత్ బుజ్జీ(33)కి భర్త ముదావత్ మాల్యా, నలుగురు పిల్లలు న్నారు. కొంతకాలంగా బుజ్జీ కల్లుతోపాటు మద్యానికి బానిసగా మారింది. కుటుంబ సభ్యులను పట్టించుకోకపోవడంతోపాటు తరచూ మద్యం సేవిస్తోంది. దీంతో వారం రోజుల క్రితం కుటుంబసభ్యుల ఒత్తిడితో మద్యం తాగడం మానేసి ఇంట్లోనే ఉంటోంది. దీంతో తీవ్ర మనోవేదనతో ఉన్న బుజ్జి సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు ఆమె సోదరుడు జానీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## తండ్రి మందలించాడని...



రాషన్ రాయ (ఫైల్)

ఖైరతాబాద్, మే 27 : తండ్రి మందలించాడని ఓ బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...అస్సాం రాష్ట్రంలోని ఉదల్‌గురి జిల్లా రాజాఘర్ గ్రామానికి చెందిన కరన్ రాయ మాజికి 2006లో సుష్మిత రాయతో వివాహం జరిగింది. వారికి సంగీత, హిమాన్షు, రాషన్ రాయ సంతానం. 2012లో భార్య సుష్మిత మరణించిన తర్వాత పిల్లలను నేపాల్‌లోని తన మామ ఇంట్లో ఉంచాడు. 2015లో కొడుకును తీసుకొని హైదరాబాద్‌కు వచ్చిన కరన్ రాయ అతడిని ఓ ప్రైవేట్ పాఠశాలలో చేర్పించాడు. 2019లో అమృత అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. చదువుకోకుండా ఆడుకుంటున్న రాషన్‌ను ఈ నెల 24న మరోసారి మందలించాడు. దీంతో తండ్రి ఇంట్లో లేని సమయంలో రూ.500 నగదు, తన దుస్తులను తీసుకొని వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**BEFORE THE SOLI ARBITRATER/ ASST.REGISTRAR OF CHITS AT MAHABUBNAGAR**
**Arbitration case No. 378 OF 2024**
**Between**
SHRIRAM RAGHAVENDRA CHITS PVT. LTD., ...DISPUTANT/PETITIONET
And
M. Govardhan Reddy S/o M. Krishna Reddy,and Others ...OPPONENTS
**NOTICE**
1. M. Govardhan Reddy S/o M. Krishna Reddy, Aged: 46 years, Occ: Driver -2, O/o TSRTC BHEL Depo, Ramchandrapuram, Hyderabad, Kangareddy Dist, Rio 8-2-293/82, plot No. 460, road No. 78, Ambedkar Nagar, Film Nagar, Jubli Hills, Hyderabad, Cell No. 8247817886. ...Opponent

Take notice that the above Arbitration case filed by the Disputant to recover the chits dues under A.P.Chit Fund Act. And Rules of 2008 against you and Others. You are avoiding the notice, hence we are publishing notice on you to appear before the Arbitrator H.No. 7-5-108/2/A, Registration office, 1st Floor, Opp: Hidu staion Petrol Bank, Venkateshwara Colony, Maha bubnagar On **31-05-2025** at **11-30 A.M.** for your appearance in person or through an advocate, in case you failed to appear before this Hon'ble Arbitrator the claim will be decided ex-parte.
**"BY THE ORDER OF THE ARBITRATOR"**
**Mahabubnagar**
**ABDULKHADER Advocate**
**H.No.4-2-16/6/H/2/5, Ramaiah Bowli**
**Mahabubnagar . Cell No.9849894232**

**PUBLIC NOTICE**

The general public is hereby informed that my client **Diwan Deepak,** S/o: late D Mothi Lal, Age: 30 Years, Occ: Business 13-5-38/2/C, Karwan, Karwan, Asif Nagar, Hyderabad, Telangana - 500067 is planning to enter into agreement of sale regarding the house property **"All that the Municipal House bearing No. 4-4-122/1/P, (PTIN No. 1115501327), in Survey No. 64, admeasuring 52.00 Sq. Yards or 43.47 Sq. Mtrs., (with plinth area 100 Sq. feet, A.C.C.), Situated at ATTAPUR VILLAGE, under GHMC, Rajendranagar Circle, Ranga Reddy Dist., Telangana State, and bounded by: North: House of J. Jangaiah., South: 30' Wide Road., East: Part of House No. 4-4-122/1, West: House of Ramu Goud and All that the Residential House Bearing Municipal No. 4-4-122/1 (PTI No. 1060400329), in Survey No. 64, admeasuring 50.00 Square Yards or equivalent to 41.8 Square Meters, With a Built-up area of 100.00 Sq. Feets (A.C.C), Situated at "ATTAPUR VILLAGE", GHMC Rajendranagar Circle, Ranga Reddy District, T.S and bounded by North: House of J. Jangaiah, South: 30'-0" Wide Road, East: House of N. Narsimha, West: H.No. 4-4-122/1/P (Herein after referred as schedule property) from its original owner Sri. Gachuvai mahesh,** S/o. Sri. Gachuvai sudarshan, aged about 38 years, Occupation: Business, R/o. H.No. 4-4-114, B.N. Colony, Attapur, GHMC-Rajendranagar Cirice, Ranga Reddy District, Telangana State-500048, and **Sri. Nemure Mahipal,** S/o. Sri. Nemure Narsimha, aged about 37 years, Occupation: Business, R/o. H.No. 4-4-120, Attapur, GHMC Rajendranagar Cirlce, Ranga Reddy District, Telangana State-500048 and intended to complete sale transaction within a short period. If any person or persons has or have got any interest, claim or any objection for the sale of the said schedule property by way of sale, mortgage, lease, lien, gift, easement, exchange, possession, inheritance, succession, joint interest or otherwise howsoever in respect to the said schedule property and the same are required to intimate to the undermentioned together with relevant proof of documents thereof within 3 days of publication of this notice failing which my client shall complete the sale/transaction and all such claims, if any, shall be deemed to have been waived and/or abandoned.
**Aditya Law Firm**
**Laxmikantham T Vukkalkar**
**Pawan T Vukkalkar**
**Manoj T Vukkalkar**
**Vinay T Vukkalkar**
**Karthik T Vukkalkar**
**Advocates - 9704829022,**
H.No. 3-112/6/3, Bheem Reddy Nagar Colony, Boduppal, Uppal Depot, Hyderabad, Telangana-500092.